విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధించాలి

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్ : విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, జూన్ 12 : విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని టంగాపూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించడంతోపాటు మధ్యాహ్న భోజనం కూడా అందించి డ్రాఫౌట్ శాతాన్ని తగ్గిస్తుందని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు సరస్వతీమాత చిత్రపటానికి విశేషపూజలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామారావు, హెచ్ఎం సూరిశెట్టి గణేశ్, నీల శ్రీధర్, పీవీ శర్మ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

బల్మూరు, జూన్ 12 : తెలంగాణ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నదని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కొండనాగుల జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన బడిబాటలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫామ్స్ అందజేశారు. అనంతరం మహిళల ఎంబ్రాయిడరీ శిక్షణను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ అరుణ, ఏపీడీ లక్ష్మీనారాయణ, ఎంఈవో రామరావు, నాయకులు వెంకట్ రెడ్డి, శ్రీను, గిరివర్ధన్ గౌడ్, రాధాకృష్ణ, శ్రీనివాసులు, శ్రీపతి రావు, చంద్రమోహన్, మశన్న, రామస్వామిగౌడ్, వెంకటయ్య, ఎంపీడీవో భాస్కర్, హెచ్ఎం విష్ణుమూర్తి ఉన్నారు.

సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య

- మౌలిక వసతులు
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు
- 'బడిబాట' కార్యక్రమంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్

కల్వకుర్తి రూరల్, జూన్ 12 : సర్కారు బడుల్లోనే తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సర్కారు బడులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం కల్వకుర్తి మండలం మార్చాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో పాటు డీఈవో గోవిందరాజులు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని సరస్వతి మాత విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చక్కటి మౌలిక వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు చక్కగా సేవలందిస్తున్నారన్నారు. పాఠశాలలో 'మన ఊరు-మనబడి' కార్యక్రమం ద్వారా పలు అభివృద్ధి పనులు నిర్వహించగా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను గ్రామ పెద్దలు విద్యావంతులు చొరవ తీసుకొని పూర్తిచేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలను సంరక్షించుకోవడం ప్రజలందరి బాధ్యత అని గుర్తు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. పదో తరగతి వార్షిక ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంపై హెచ్ ఎం ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీను, తాసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో వెంకట్రాములు, ఎంఈవో బాసునాయక్, ఏపీడీ చంద్రశేఖర్, ఏపీఎం శ్రీనివాసులు ఏఎంసీ మాజీ చైర్మన్ బాలయ్య, గ్రామ పెద్దలు వెంకట్‌రెడ్డి, మల్లేశ్, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణయ్య, మదన్‌మోహన్‌రావు, హెచ్ ఎంలు సురేందర్‌రెడ్డి, వెంకటయ్య ఉన్నారు.

యూనిఫాం, బుక్స్ అందుకున్న విద్యార్థులతో కలెక్టర్

ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కల్వకుర్తి, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని బుధవారం కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థుల కోసం సమకూర్చిన పాఠశాల బ్యాగులు, పుస్తకాలు, ఏకరూప దుస్తులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే కల్వకుర్తి మున్సిపాలిటీలో పలు పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొన్నారు. ప్రభుత్వం సమకూర్చిన పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులను విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ సత్యం పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ మనోహర, ఎంఈవో బాసునాయక్, విజయకుమార్‌రెడ్డి, హెచ్ఎం ఎల్లయ్య, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు నసీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట

- తెరుచుకున్న పాఠశాలలు
- స్వల్పసంఖ్యలో విద్యార్థుల హాజరు
- పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ

వంగూరు : కొండారెడ్డిపల్లిలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎంపీ మల్లురవి

వంగూరు, జూన్ 12 : మండలంలోని కొండారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఉదయ్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఎంపీ మల్లురవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల అధారిత కుటుంబాల మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి న్యాక్ సంస్థ ద్వారా కుట్టు మిషన్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మ, జెడ్పీటీసీ కేపీఎన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, డీఈవో గోవిందరాజులు, ఆర్డీవో శ్రీనివాసులు, తాసీల్దార్ కిరణ్మయి, ఎంఈవో శంకర్‌నాయక్, నాయకులు పండిత్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, వేమారెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

తాడూరులో..

తాడూరు, జూన్ 12 : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఎంపీ మల్లురవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కస్తూర్బా పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నో రకాల సదుపాయాలు కల్పిస్తుందని, వీటన్నింటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయని, విద్యార్థులు పాఠశాలకు సకాలంలో వచ్చేలా విద్యార్థులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీ వెంట జెడ్పీటీసీ రోహిణి, ఎంపీటీసీ రేణుకమ్మ, నాయకులు వల్లభ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య ఉన్నారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, జూన్ 12 : మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాధికారి బాలకిషన్ విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ రాఘవేందర్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కోడేరులో..

కోడేరు, జూన్ 12 : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కోడేరు, ఎత్తం మైలారం, నాగులపల్లి, జనుంపల్లి, తీగలపల్లి, బావాయిపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలను అందజేశారు.

చారకొండలో..

చారకొండ, జూన్ 12: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం యాదగిరి, పంచాయతీ కార్యదర్శి గణేశ్, ఉపాధ్యాయురాలు మాధవి ఉన్నారు.

తిమ్మాజిపేట, కల్వకుర్తి మండలాల్లో..

తిమ్మాజిపేట/కల్వకుర్తి రూరల్, జూన్ 12 : తిమ్మాజిపేట, కల్వకుర్తి మండలాల్లోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను, తరగతి గదులను ఉపాధ్యాయులు అందంగా అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. తిమ్మాజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంఈవో శ్రీనివాసులు, జీహెచ్ఎం సత్యనారాయణశెట్టి, ఏపీఎం శ్రీహరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ

లింగాల, జూన్ 12 : మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం నుంచి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవింద్, శ్రీను, అహ్మద్, సిబ్బంది ఉన్నారు.

తాడూరులో..

తాడూరు, జూన్ 12 : మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో బుధవారం జెడ్పీటీసీ రోహిణి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 2,953 మంది విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌రెడ్డి, విండోచైర్మన్ బాల్‌రెడ్డి ఉన్నారు.

సింగారంలో

అచ్చంపేటరూరల్, జూన్ 12 : మండలంలోని సింగారంలో బడిబాట ర్యాలీ నిర్వహించినట్లు ఎంఈవో రామరావు తెలిపారు. గుంపన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు గోపాల్ నాయక్, నరేశ్, సృజన పాల్గొన్నారు.

మర్రిగుంత తండాలో దెయ్యం కలకలం

వెల్దండ, జూన్ 12: మండలంలోని మర్రిగుంత తండాలో దెయ్యం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే మర్రిగుంత తండాకు చెందిన భాస్కర్, నవీన్ ఆమన్‌గల్ పట్టణానికి వెళ్లి రాత్రి 12గంటల సమయంలో తిరిగి మర్రిగుంత తండాకు బైక్‌పై ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తండా సమీపంలోని రహదారిలో అర్ధరాత్రి ఓ మహిళా రూపంలో దెయ్యం కనిపించడంతో వారు బైక్‌పై నుంచి ఫోటో తీసి, దగ్గరికి వెళ్లి చూడగా కాళ్లు చేతులు వింతగా ఉండడంతో వాళ్లు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై అక్కడ నుంచి తండాకు పరారయ్యారు. విషయాన్ని తండాలో ప్రజలకు చెప్పగా వారు వచ్చే సరికి దెయ్యం కనిపించలేదని బాధితులు తెలిపారు.

నిద్రమత్తులో వెటర్నరీ ఉద్యోగి

- గురకపెట్టి కునుకు తీసిన వైనం

కార్యాలయంలో నిద్రపోతున్న అజీమ్

బిజినేపల్లి, జూన్ 12 : బిజినేపల్లి మండల కేంద్రంలోని వెటర్నరీ కార్యాలయంలో ఓ ఉద్యోగి గురకపెట్టి నిద్రపోతూ కనిపించిన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఈ ఘటనను చూసి నివ్వెరపోయారు. మధ్యాహ్నం 2గంటలకు బిజినేపల్లి పశువైద్య కేంద్రంలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ అజీమ్ కునుకుతీస్తూ కనిపించాడు. తాను ప్రభుత్వ ఉద్యోగినని, విధుల్లో ఉన్నాననే విషయాన్ని మరిచి ధర్జాగా బెంచీపై పడుకొని కునుకు తీశాడు. కార్యాలయంలో తలుపులు మూసి కిటికీలు తెరుచుకొని గురకపెట్టి నిద్రపోయాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు సమయం కాకముందే ఇండ్లకు వెళ్లిపోతున్నారు. ఇంత జరిగినా నిద్రిస్తున్న ఉద్యోగి 3 గంటలకే కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని మండలంలో ఇలా ఉంటే మిగతాప్రాంతాల్లో పరిస్థితి ఏమిటని ప్రజలు అవాక్కవుతున్నారు. ఈ విషయమై వెటర్నరీ డాక్టర్ జీవితను వివరణ కోరగా ఉదయం ఎక్కువ మొత్తంలో పశువులను ఆరోగ్య పరీక్షలకోసం రైతులు తీసుకురావడంతో పనులు ఎక్కువగా ఉన్నాయన్నారు. సంబంధిత ఉద్యోగికి బ్యాక్ పెయిన్ ఉండడంతో నిద్రించి ఉండొచ్చని తెలిపారు. ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చూసుకుంటామని పేర్కొన్నారు.

అచ్చంపేట మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- అనుకూలంగా ఓటువేసిన 17మంది సభ్యులు
- కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగని బీఆర్ఎస్ కౌన్సిలర్లు

అచ్చంపేట, జూన్ 12 : అచ్చంపేట బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్‌పై కాంగ్రెస్ పార్టీ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం ప్రిసైడింగ్ అధికారి, అచ్చంపేట ఆర్డీవో మాధవి కలెక్టర్ ఆదేశాల మేరకు అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతోపాటు 16మంది కౌన్సిలర్లు అనుకూలంగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గింది. బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు కౌన్సిలర్లు హాజరుకాలేదు. మొత్తం 20మంది కౌన్సిలర్లు ఉండగా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిపి 21మంది సభ్యులకు గానూ 17 మంది సభ్యులు హాజరై అనుకూలంగా ఓటు వేయడంతో అవిశ్వాసం నెగ్గింది. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉన్నది. 14వ వార్డు కౌన్సిలర్ గార్లపాటి శ్రీనివాసులును కొత్త మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. 2021లో జరిగిన అచ్చంపేట మున్సిపల్ ఎన్నికల్లో 20వార్డుల్లో బీఆర్ఎస్‌కు 13, కాంగ్రెస్‌కు 6, బీజేపీకి 1 సీట్లు లభించాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు 5వ వార్డు కౌన్సిలర్ ఆకుల లావణ్య కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల తర్వాత మున్సిపల్ వైస్‌చైర్మన్ పోరెడ్డి శైలాజావిష్ణువర్ధన్‌రెడ్డి చేరారు. అవిశ్వాసానికి మరో ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మొత్తం 13మంది సంతకాలు పెట్టి గత నెల 25న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్ఎస్ కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీ క్యాంప్‌నకు తీసుకెళ్లారు. మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సుంకరినిర్మలాబాలరాజు, అప్పశివ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 15 మంది సభ్యులకు చేరింది. అవిశ్వాసం సందర్భంగా పార్టీ బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ చేసింది. ప్రిసైడింగ్ అధికారి మాధవికి విప్ పత్రాలను బీఆర్ఎస్ నేతలు మంగళవారం అందజేశారు. అయితే 24గంటల ముందు విప్ జారీ చేసిఉంటే పరిగణలోకి తీసుకునేవారమని మంగళవారం 12 గంటలకు విప్ జారీ పత్రములు అందజేశారని ఆర్డీవో మాధవి తెలిపారు. దీంతో విప్ జారీచేసిన ఉపయోగం లేకుండా పోయిందని తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు పంపించిన అనంతరం వారి ఆదేశాల మేరకు కొత్త చైర్మన్ ఎన్నిక కోసం మరో నోటిఫికేషన్ విడుదల చేస్తారని తెలిపారు.

ప్రలోభాలకు లొంగని బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కాంగ్రెస్ పార్టీ పెట్టిన అవిశ్వాసం నెగ్గడానికి సరైన సంఖ్య లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను అనేక ప్రలోభాలకు గురిచేసి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంది. నర్సింహాగౌడ్ మినహా మిగిలిన ముగ్గురు 15వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మనోహర్‌ప్రసాద్, 20వ వార్డు కౌన్సిలర్ రమేశ్‌రావు, 15వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ ఖాజాబీను కూడా పార్టీలో చేర్చుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. కానీ వాళ్లు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించి బీఆర్ఎస్‌లోనే నిలబడ్డారు. చాలా ఒత్తిడి కూడా పెట్టినట్లు తెలిసింది. ఓ మంత్రితో కూడా ఫోన్లు చేయించినట్లు సమాచారం. ప్రజలు నమ్మి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించారని అదేపార్టీలో ఉంటామని వారు తేల్చిచెప్పారు. వీళ్లు అవిశ్వాసానికి దూరంగా ఉన్నారు.. సమావేశానికి కూడా హాజరుకాలేదు. దీంతో బీఆర్ఎస్ కౌన్సిలర్ల పట్ల వార్డువాసులు, పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సబిత

నాగర్‌కర్నూల్, జూన్ 12 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సబిత సూచించారు. బుధవారం జిల్లా న్యాయ సేవా సంస్థ నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 14 ఏండ్లు వచ్చే వరకు బాలలతో శారీరకంగా ఎలాంటి పనులు చేయించరాదన్నారు. బాలబాలికలందరినీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లత, న్యాయవాదులు మధుసూదన్‌రావు, సత్యనారాయణ, శ్యాంప్రసాద్,రావు, రాంచందర్, శ్రీరామ్‌ఆర్య, పవన్‌సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల, జూన్ 12 : బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా లేబర్ అధికారి షఫియొద్దీన్ అన్నారు. బుధవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలకు పాఠశాలలకు పంపించాలన్నారు. ముఖ్యంగా 14 సంవత్సరాలలోపు పిల్లలకు దుకాణాలలో, పశువుల కాపరులుగా, హోటల్స్‌లో పనిల్లో పెట్టుకొని వెట్టి చాకిరి చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో డీసీపీవో కార్యాలయ అధికారి వేణుగోపాల్, హెచ్ఎం శేఖర్, కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, శ్రీనివాసులు, జాకీర్ హుసేన్, జిల్లా చైల్డ్‌లైన్ ప్రమీల, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ మల్లేశ్, ఉపాధ్యాయులు అరవింద్, వెంకట్ రాజు, పురుషోత్తం, పరశురాములు, సుందరయ్య, శ్రీను, స్వరూప పాల్గొన్నారు.

'హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలి'

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ

కోడేరు, జూన్ 12: ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండ వెంకట్‌రాధ అధ్యక్షతన బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మాట్లాడుతూ కార్యాలయంలో కనీసం ఇన్వెర్టర్ కూడా లేకుండా పనులు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. ఇందుకు ఎంపీపీ ఎలాంటి సమాధానం చెప్పకుండా సమావేశం నుంచి బైటికి వెళ్లిపోయి తన చాంబర్‌లో కూర్చున్నారు. ఎంపీడీవో శ్రీనివాసులు అటెండర్‌ను పంపించి మీటింగ్ హాల్‌కు రావాలని కోరినా ఎంపీపీ తాను రానని మీరే సమావేశం నిర్వహించుకోవాలని చెప్పి పంపింది. దీంతో వైస్ ఎంపీపీ కొత్త శ్రీనివాస్‌రావు అనంతరం సమావేశాన్ని కొనసాగించారు. మండల సర్వసభ్యసమావేశానికి హాజరుకాని వైద్యం, చిన్నతరహా, నీటిపారుదలశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, అటవీ, పౌరసరఫరాలశాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ మార్కెట్, ఎక్సైజ్, ఉద్యానవనశాఖ, ఆర్టీసీ శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సభలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

రెస్టారెంట్‌లో వంటకాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

నాగర్‌కర్నూల్, జూన్ 12: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో శుభం రెస్టారెంట్, హిమాలయ రెస్టారెంట్, చిల్లీ రెస్టారెంట్, బర్గర్‌కింగ్ బేకరీ తదితర హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాంసం, కాలం చెల్లిన వస్తువులను పరిశీలించారు. ఎక్కడైనా నిల్వ మాంసం, శుభ్రత, కాలం చెల్లిన పదార్థాలు విక్రయించినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

చారకొండ, జూన్ 12 : రైస్ మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ ప్రమీల హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు జూపల్లిలో పలు రైస్ మిల్లులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, వడ్ల స్టాక్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఏలాంటి ఇబ్బందులు పెట్టొదని మిల్లర్లకు సూచించారు. ధాన్యంలో అవకతవకలు చేస్తే చర్యలు తప్పవని చెప్పారు. ఆమె వెంట ఎంఆర్ఐ నబి, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ వాసికి డాక్టరేట్

కొల్లాపూర్, జూన్ 12: కొల్లాపూర్‌కు చెందిన అజయ్‌కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఫిజిక్స్ విభాగంలో డాక్టరేట్ సాధించాడు.ప్రొఫెసర్ శివకుమార్ పర్యవేక్షణలో లిథియం అయాన్ ఆధారిత నానోమిశ్రమ పాలీమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ పరిశోధనకు సంబంధించిన వ్యాసాలు సైన్స్ సైటేషన్ ఇండెక్స్‌లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం అజయ్‌కుమార్ గద్వాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. అజయ్‌కుమార్‌ను కొల్లాపూర్ వాసులు బాల్యమిత్రులు అభినందించారు.

రైతుబంధు ఊసేది

- బీఆర్ఎస్ మండలా